రాష్ట్ర స్థాయికి ఖోఖోకు ట్రినిటీ విద్యార్థిని

● ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందనలు

మనస్విని‌ని అభినందిస్తున్న ట్రినిటీ ఫౌండర్ మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 2 : జగిత్యాలలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-14) ఖోఖో పోటీల్లో ట్రినిటీ హైస్కూల్ విద్యార్థిని జే మనస్విని రావు సత్తాచాటింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్న విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, ఈ మేరకు శనివారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఇక్కడ పీఈటీ భూక్య భూపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిట్టూరు విద్యార్థిని ఎంపిక

పెద్దపల్లి రూరల్, నవంబర్ 2: నిట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అట్ల సాత్విక రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య తెలిపారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో సాత్విక అత్యంత ప్రతిభ చూపింది. రేపటి నుంచి కామారెడ్డిలోని పోసానిపేట జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం వెల్లడించారు. సాత్వికను హెచ్‌ఎంతోపాటు పీఈటీ భాస్కర్ అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు

పాలకుర్తి, నవంబర్2: జీడీనగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లిలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన బీ సాయిఅక్షయ్(లాంగ్‌జంప్), ఈ అరవింద్ రన్నింగ్‌లో సత్తాచాటి, ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతోపాటు హెచ్‌ఎం అఫ్జల్, టీచర్లు అభినందించారు. అలాగే బసంత్‌నగర్‌లోని అలీవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ శ్రీధర్(రన్నింగ్) ,జైనోద్దీన్(షాట్‌పుట్)లో ప్రతిభచూపి ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ జాఫర్ తెలిపారు.

పుట్ట మధూకర్ పరామర్శ

ముత్తారం: అజయ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధూకర్

ముత్తారం/మంథనిరూరల్, నవంబర్ 2: మైదంబండ గ్రామానికి చెందిన బియ్యాని అజయ్ శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకోగా, శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, నాయకులు నాంసాని సమ్మయ్య, బియ్యాని రాజు ఉన్నారు. అలాగే మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన మంథని లింగయ్య శనివారం మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రైతులు నష్టపోవద్దు

● కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి ● ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి ● కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: ఏఎంసీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, నవంబర్ 2: వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులకు నష్టం కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం మంథనిలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అకాల వర్షం కారణంగా తడిచిన ధాన్యాన్ని పరిశీలించి, సెంటర్ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని, అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని శ్రీరామ్‌నగర్‌లో జరుగుతున్న ఇంటింటా సర్వే ప్రక్రియను పరిశీలించి, హౌస్ లిస్టింగ్ పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సర్వే జరిగిన తర్వాత గుర్తు గా మ్యాపింగ్ ఉండాలని, ఒక ఇంటిలో రెండు కుటుంబాలు ఉంటే వేర్వేరుగా వివరాలు సేకరించాలన్నారు. అనంతరం మంథనిలోని ప్రభుత్వ దవాఖాన, మాతా శిశు ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఎంసీహెచ్ ప్రహరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మంథని ప్రభుత్వ దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాసురేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

రవాణాకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

పెద్దపల్లి, నవంబర్ 2: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణాకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, వాహనాలు అందుబాటులో లేకపోతే టెండర్ రద్దు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కాంట్రాక్టర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో ధాన్యం రవాణాపై అదనపు కలెక్టర్ డీ వేణుతో కలిసి అధికారులతో సమీక్షించారు. రవాణా సరిపడా వాహనాలు అందుబాటులో లేవనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డీఏవో దోమ ఆదిరెడ్డి, ఆర్టీవో రంగారావు, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్ ఉన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి, నవంబర్2: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ ఈఈ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● దళారులను నమ్మొద్దు ● పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ఓదెల: లంబాడి తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల, నవంబర్ 2: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గర్రెపల్లి, సర్వయ్యపల్లి, బొంతకుంటపల్లి, భూపతిపూర్, ఐతరాజ్‌పల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతోపాటు ఓదెల మండలం ఉప్పరపల్లి, గోపరపల్లి, హరిపురం, లంబాడితండా, అబ్బిడిపల్లి గ్రామాల్లో ప్యాక్స్, సెర్ఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్లను ప్రారంభించి, ఆయా చోట్ల మాట్లాడారు. కొనుగోళ్ల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఒక్క గింజ కూడా కటింగ్ లేకుండా కొనిపిచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను నాయకులు వెంకన్నతో పాటు పలువురు శాలువాతో సత్కరించారు. ఇక్కడ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, వైస్ చైర్మన్ దీకొండ శ్రీనివాస్, నాయకులు వెంకన్న, రమణారెడ్డి, రాజిరెడ్డి, ఉన్నారు. ఓదెల మండలంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, నాయకులు ఉన్నారు.

కుల గణనతో ప్రజలకు మేలు

పెద్దపల్లి టౌన్, నవంబర్ 2: కుల గణనతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి ఆర్కే గార్డెన్‌లో కుల గణనపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కుల గణన చేయడం ద్వారా ఎస్సీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు రాజకీయంగా అవకాశాలు వస్తాయన్నారు. ఇక్కడ పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్‌రావు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, నాయకులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

● సమగ్ర వివరాలు సేకరించాలి
● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ

కోల్‌సిటీ, నవంబర్ 2: ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా జరగాలని, ఎక్కడా తప్పులు దొర్లకుండా పూర్తి వివరాలు సేకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం ఎఫ్ఏసీ కమిషనర్ జే అరుణ శ్రీ సూచించారు. రామగుండం నగరంలోని 6వ డివిజన్‌లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే హౌస్ లిస్టింగ్ ప్రక్రియను శనివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. సిబ్బంది పని తీరును స్వయంగా సమీక్షించారు. సర్వేకు సంబంధించి అన్ని అంశాలను ముందుగానే ఇంటి యాజమానికి వివరించాలని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత ఇంటికి స్టిక్కర్ అంటించాలని, ఎక్కడ ఫిర్యాదులు రాకుండా సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ శంకర్ రావు ఉన్నారు.

ఎంపీ వంశీకృష్ణకు సన్మానం

జ్యోతినగర్, నవంబర్ 2: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్శన నేపథ్యంలో ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని జ్యోతి భవన్‌కు వచ్చిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను శనివారం ఎన్టీపీసీ జీఎంలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెన్సీ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠి, తెలంగాణ ప్రాజెక్టు జీఎం జీబీ సురేశ్, జీఎం సంజీబ్ సహా, ఏజీఎం హెచ్‌ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్, అధికారి వేముగంటి యుగేందర్ రావు ఉన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పీ మల్లికార్జున్, తోగరి తిరుపతి, తాజ్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

శ్రీహితకు కొప్పుల అభినందన

శ్రీహితను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం, నవంబర్2: ఎంబీబీఎస్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి, నిర్మల్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు పొందిన నంది మేడారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సాన రాజేందర్ కూతురు సాన శ్రీహితను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందించారు. పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. శనివారం కరీంనగర్‌లోని తన స్వగృహంలో శ్రీహితను కొప్పుల సన్మానించారు. కార్యక్రమంలో శ్రీహిత తండ్రి రాజేందర్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సలామొద్దీన్, పార్టీ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పొనుగోటి యుగేందర్ రావు, ఉప్పు రాజయ్య, పరంధాములు, బోయిని మధు, ముక్తి చంద్రయ్య ఉన్నారు.

అలవెన్స్ కోత నిలిపివేయాలి

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 2: సింగరేణి ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లి గని కార్మికులకు నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ అలవెన్స్ కోతను వెంటనే నిలిపివేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షుడు చెరుకు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి బేతి చంద్రయ్య డిమాండ్ చేశారు. 5వేలకు పైగా భూగర్భ మస్టర్లకు సంబంధించి అలవెన్స్‌లను అక్టోబర్ వేతనంలో కోత పెట్టడం కార్మిక వర్గాన్ని ఆర్థిక దోపిడీ చేయడమేనని మండిపడ్డారు. యాజమాన్యం కేటాయించిన పనులను మాత్రమే చేసిన కార్మికుల అలవెన్సులను ఎవరో పనికిమాలిన వ్యక్తులు ఫిర్యాదు చేశారని కోత పెట్టడం సరికాదని, ఈ చర్యను ఉపసంహరించుకోవాలని, లేదంటే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రతినిధిగా ప్రవీణ్

గోదావరిఖని, నవంబర్ 2: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధిగా గోదావరిఖనికి చెందిన హరిహరపుత్ర ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ పొరండ్ల ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదేశాల మేరకు ప్రవీణ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఆడెపు శంకర్ తెలిపారు.

మున్నూరు కాపు సంఘం కొత్త కమిటీ

ధర్మారం, నవంబర్ 2: బొమ్మారెడ్డిపల్లి గ్రామ శాఖ మున్నూరు కాపు సంఘం కొత్త కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎడిపెల్లి నర్సయ్య, ఎగ్గెల స్వామి, అధ్యక్షుడిగా ఎగ్గెల సాగర్, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, కోశాధికారిగా మిట్ట సాయి, ఉపాధ్యక్షులుగా ఎర్రం రాజు, ఎర్రం గంగయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎర్రం శ్రీనివాస్, సభ్యులుగా పెంట స్వామి, ఎడిపెల్లి రామయ్య, ఆకుల సురేష్, ఆకుల భూమయ్య, రవి, కాగితపు వాసు ఎన్నికయ్యారు. ఈ కమిటీ పదవీ కాలం 2026 డిసెంబర్ వరకుఉంటుందని నాయకులు తెలిపారు.

4న శిక్షణ తరగతులు ప్రారంభం

పెద్దపల్లి, నవంబర్2: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ఈ నెల 4 నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. డిగ్రీ/బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగులు శిక్షణ కోసం పేరు నమోదు చేసుకొని, తరగతులకు హాజరు కావచ్చని సూచించారు. శిక్షణ తర్వాత ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తారని, వివరాలకు టాస్క్ రీజినల్ హెడ్ సవీన్ రెడ్డిని 70755 22671 నంబర్‌లో సంప్రదించాలని ప్రకటనలో సూచించారు.

ఒలంపియాడ్ టెస్ట్‌లో గాయత్రి విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 2: ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్ప్ (బెంగుళూర్) ఆధ్వర్యంలో గత సమ్మర్‌లో నిర్వహించిన ఒలంపియాడ్ ఆన్‌లైన్ టెస్టులో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటి ఇంటర్నేషనల్ ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విద్యార్థులు పెద్ది సాయితేజ, చాట్ల శ్రీమాన్, మహమ్మద్ రెహన్, ఉట్నూరు చక్రికను డీఈవో మాధవి తన కార్యాలయంలో అభినందించి, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేశారు. ఇక్కడ సర్వశిక్షా అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పీఎం షేక్, విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ ఉన్నారు.

ఆర్జీ-1లో 89శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని, నవంబర్ 2: సింగరేణి ఆర్జీ-1లో గత నెలలో 89శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. శనివారం గోదావరిఖనిలోని ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత నెలలో 4,41,200 టన్నుల లక్ష్యానికి గాను 3,92,135 టన్నులు(89శాతం) సాధించిందని, ఇందులో అత్యధికంగా ఓపెన్‌కాస్ట్ 5 నుంచి 3,18,854 టన్నులు సాధించినట్లు జీఎం పేర్కొన్నారు. గడిచిన ఏడు నెలల్లో 27,52,900 టన్నుల టార్గెట్‌కు గాను 23,91,748 టన్నులు(87 శాతం) సాధించినట్లు పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో భారీగా బొగ్గు ఉత్పత్తి తగ్గడం వల్ల నిర్దేశిత లక్ష్యం సాధ్యంకాలేదన్నారు. సింగరేణి సేవాసమితి ద్వారా ఉచిత వృత్తివిద్యా కోర్సుల్లో 70మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తితో పాటు సంక్షేమ కార్యక్రమాల్లోనూ ఆర్జీ-1 ముందంజలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు చిలుక శ్రీనివాస్, ఆంజనేయప్రసాద్, ధనలక్ష్మీబాయ్, మోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాస్, వీరారెడ్డి, వసంత్‌కుమార్ ఉన్నారు.

ఆర్జీ-2లో 79 శాతం..

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 2: సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో గత అక్టోబర్‌లో 9,17,700 టన్నులకు లక్ష్యానికిగాను 7,25,883 టన్నులు 79 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక గడిచిన ఏడు నెలలకు గానూ 45,29,000 టన్నులకు గానూ 46,60,369 టన్నులతో 103 శాతంతో బొగ్గు ఉత్పత్తి సాధించామని, 6,54,916 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు తెలిపారు. ఓబీ తొలగింపు లక్ష్యాలలో 59,84,000 క్యూబిక్ మీటర్లకు గానూ 43,05,269 క్యూబిక్ మీటర్లు 72 శాతం తొలగించినట్లు వివరించారు.

వరకట్నం వేధింపులతో యువతి ఆత్మహత్య

ముత్తారం, నవంబర్ 2: అడవి శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అమరాబాద్‌లో వరకట్న వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన సమత(22), అమరాబాద్‌కు చెందిన బిస్కుల సంతోష్ 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి 10 నెలల బాబు ఉన్నాడు. అయితే సమతను కట్నం తేవాలని ఏడాదిగా సంతోష్ వేధిస్తుండగా, శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. సమత తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు.

ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని..

మైదంబండలో యువకుడి బలవన్మరణం

ముత్తారం, నవంబర్ 2: ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదేమోనన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైదంబండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బియ్యాని అజయ్ (24) ఓ గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. ఆ యువతి తల్లిదండ్రులు ఆమెకు పెండ్లి సంబంధాలు చూస్తుండగా, మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రక్షణ చర్యలపై జీఎం సమీక్ష

రామగిరి, నవంబర్ 2: అడ్రియాల గనిలో రక్షణ చర్యలపై శనివారం కొత్తగూడెం కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ సమీక్షించారు. గనిలోపలికి వెళ్లి లాంగ్‌వాల్ ప్యానల్‌లో రక్షణ చర్యలను పరిశీలించారు. రక్షణ నియమాలు పాటిస్తూనే అధికారులు, కార్మికులు సమష్టి కృషితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం హరినారాయణ గుప్తా, ఇన్‌ఛార్జి జీఎం కొలిపాక నాగేశ్వరరావు, మేనేజర్ కోడెం జనార్దన్ ఉన్నారు.

మద్యం నిషేధాజ్ఞలు కొనసాగింపు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 2: సాధారణ పౌరులు, మహిళల ఇబ్బందుల దృష్ట్యా రామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో అమలలో ఉన్న మద్యం నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియులు హంగామాపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజే సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆదేశాలు ఈ నెల 1 నుంచి వచ్చే నెల వరకు అమల్లో ఉంటాయని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయవంతం చేయాలి

కోల్‌సిటీ, నవంబర్ 2: జిల్లాలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి డిసెంబర్ 6 వరకు నిర్వహించనున్న 75వ రాజ్యాంగ అమలు దశ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా కన్వీనర్ లంక సదయ్య కోరారు. శనివారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు హక్కులు వచ్చాయన్నారు. పెద్దపల్లి జిల్లాలో రాజ్యాంగం అమలు దశ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం..

మంథని యువతి దుర్మరణం

మంథని, నవంబర్ 2: మంథనికి చెందిన మారుపాక రోహిత(24) శనివారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. రోహిత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నది. శనివారం సెలవు రోజు కావడంతో ఉదయాన్నే తన స్నేహితురాలిని కలిసేందుకు బైక్‌పై వెళ్తూ, తార్నాక వద్ద అదుపు తప్పి కింద పడిపోయింది. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఆమె పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోహిత తండ్రి శ్రీకాంత్ చిన్నతనంలోనే మృతి చెందగా, తల్లి సునంద మంథని ఆర్డీవో కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోహిత మృతితో మంథనిలో విషాదం అలుముకుంది.

బీసీ ఆజాది యూత్ మండల కమిటీ

ధర్మారం, నవంబర్2: బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ మండలాధ్యక్షుడిగా దొంగతుర్తికి చెందిన ముదాం శ్రావణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం ఫెడరేషన్ యూత్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్,జిల్లా కన్వీనర్ బండారి బీరయ్య ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి ఫెడరేషన్ ఎన్నికల్లో శ్రావణ్‌కుమార్‌తోపాటు మండల ప్రధాన కార్యదర్శిగా తుమ్మల తిరుపతి, ఉపాధ్యక్షులుగా బొంగాని తిరుపతి, మేడవేని వినోద్, కోశాధికారిగా కొడిచెర్ల రాజు, కార్యనిర్వహణ కార్యదర్శిగా పిట్టల స్వరూప రాణి, అల్వాల సంతోష్, ప్రచార కార్యదర్శులుగా సొన్నాయిల గంగయ్య, బొట్ల మల్లేశం, ఎండీ అజాం ఎన్నికైనట్లు జాతీయ అధ్యక్షుడు సంజయ్ కుమార్ వెల్లడించారు.

బోనస్ కోసం సామూహికంగా చర్చిద్దాం

● యూనియన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత కౌశికహరి

కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న కౌశికహరి

పాలకుర్తి, నవంబర్ 2: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం కాంట్రాక్ట్ కార్మికులకు దీపావళి బోనస్ కోసం సామూహికంగా చర్చలకు వెళ్దామని, యాజమాన్యం దిగివచ్చేదాకా పోరాడుదామని యూనియన్ అధ్యక్షుడు కౌశికహరి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కర్మాగారం ఆవరణలో కేశోరాం కాంట్రాక్టు కార్మికులతో కలిసి బోనస్ విషయమై చర్చించారు. గతంలో బోనస్ గురించి చర్చలు జరిపితే, ఈ నెల 2లోగా కాంట్రాక్టు కార్మికులకు వేస్తామని ప్రకటించిందని, ఇప్పటివరకు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం కార్మికులందరం కలిసి మూకుమ్మడిగా యాజమాన్యంతో బోనస్‌పై చర్చిద్దామని పేర్కొన్నారు. ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న పాలకుర్తి నాయకులు

పాలకుర్తి/ఓదెల, నవంబర్2: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్‌ను శనివారం పాలకుర్తి, ఓదెల మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు సూర సమ్మయ్య, బైరి రవిగౌడ్, నాయకులు కొలిపాక సుజాతమల్లయ్య, లావణ్య నాగరాజు, తలారి శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, మంచినీళ్ల బాస్కర్, తిరుపతి, శిలగాని రాజేశ్, రమేశ్, మాజీ సర్పంచ్ కుంచం మల్లయ్య, నాయకులు సామ మోహన్‌కుమార్, చొప్పరి రాజయ్య, ఎర్రోళ్ల రాజయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు ఆర్టిజన్ కార్మికుల వినతి

పెద్దపల్లి, నవంబర్2: ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని తెలంగాణ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు సీహెచ్ విజయ రమణారావు, మక్కాన్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఏడేండ్ల క్రితం తమ సర్వీస్ రెగ్యులర్ చేశారని, మిగతా విద్యుత్ ఉద్యోగుల్లా అర్హతను బట్టి పదోన్నతులు కల్పించేలా కృషి చేయాలని కోరారు. నాయకులు కృష్ణారెడ్డి, రాజు, ఎల్లయ్య, రఘు, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి టౌన్, నవంబర్2: పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో ఆర్థో సేవలు ప్రైవేట్‌కు దీటుగా అందిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ కోరారు. జిల్లాలో ఆర్థో సర్జరీలు గణనీయంగా పెరిగాయన్నారు. ఇంతకు ముందు నెలకు సరాసరి నాలుగు ఆర్థో సర్జరీలు జరగగా, గత ఆగస్ట్‌లో 29, సెప్టెంబర్‌లో 40, అక్టోబర్‌లో 51 సర్జరీలు జరగాయని వెల్లడించారు. ఆర్థో ప్రత్యేక నిపుణులు డాక్టర్ కుమార్, ఎంఎస్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నో క్లిష్టమైన ఆర్థో సర్జరీలను విజయవంతంగా చేశారని తెలిపారు. క్లిష్టమైన హై రిస్క్ కేసులను హ్యాండిల్ చేయగల మత్తు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, కాళ్లు వంకరగా పుట్టిన నవజాత శిశువులకు సంబంధించిన చికిత్స సైతం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ఆరుగురు నవజాత శిశువులకు చికిత్స అందించినట్లు చెప్పారు.

ఏఎంసీ, గ్రంథాలయ చైర్మన్లకు సన్మానం

సుల్తానాబాద్ నవంబర్ 2: సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన మినుపాల ప్రకాశ్‌రావును తన నివాసంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్ రావు, తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్ కస్తూరి లక్ష్మారెడ్డి సన్మానించారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావును రైస్ మిల్లు అసోసియేషన్ నాయకులు, రైస్ మిల్లర్స్ సన్మానించారు.

ఆంక్షలను తొలగించాలి

గోదావరిఖని, నవంబర్ 2: సింగరేణిలో పనిచేస్తున్న అత్యవసర సర్వీస్ పారామెడికల్ సిబ్బందికి ప్లేడే పీహెచ్‌డీలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య సింగరేణి సీఎండీని కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎండీని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189